
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఎగరనీ..!

"గోపాల్.. గెస్ట్ వస్తున్నారు, ఈరోజు పొద్దున్న, రాత్రి కూడా మరొక భోజనం ఎక్కువ కావాలి" ఫోన్ చేసి చెప్పి , "రెండేళ్ళయ్యింది కదా మనం కరుణేష్ ని కలిసి!" అన్నాడు చక్రవర్తి ఎదురుగా నెమ్మదిగా ప్రవహిస్తున్న కావేరిని, పక్కన కూర్చున్న భార్య సుచిత్రనీ మార్చి చూస్తూ.

"ఈజీగా.. మనం క్రిందటిసారి పిల్లల దగ్గరకెళ్ళినప్పుడే కదా కలిసాం." అందావిడ.

పచ్చని కాటన్ చీర, ఎర్రటి జాకెట్ వేసుకున్న ఆవిడ నున్నగా దువ్వి వేసుకున్న ముడిలో తెల్లని మల్లెలు, నుదిటిన ఎర్రని బొట్టు..

ఆవిడ వైపే తదేకంగా చూశాడాయన కొన్ని క్షణాలు..

ఏమిటన్నట్టు కళ్ళెగరేసి నవ్విందావిడ.

"ఏమీ లేదు! రంగు వెయ్యని నీ జుట్టులో తప్ప, పెరుగుతున్న వయసు మరెక్కడా కనబడడం లేదేమిటా?" అని అన్నాడాయన నవ్వుతూ..

" ఊరికే పొగడద్దు, కనిపించక ఎక్కడకి పోతుంది.. లెట్ అజ్ ఆక్సెప్ట్. వీ ఆర్ నాట్ గెట్టింగ్ యంగర్" అందావిడ తనూ నవ్వుతూ..

"ఐ లైక్ ద స్పిరిట్.. యెస్.. వి ఆర్ నాట్ గెట్టింగ్ యంగర్ అనడం కరక్ట్ అంతే కానీ వీ ఆర్ నాట్ గెట్టింగ్ ఓల్డ్" అన్నాడు ఆయన..

ఇద్దరూ కలిసి నవ్వారు ఈసారి..

"వెళ్దామా? కరుణేష్ వస్తాడు కదా?"

"సరే, సాయంత్రం అతన్ని కూడా తీసుకువద్దాం!" అంది ఆవిడ, తను చదువుతున్న పుస్తకం లోకి చూస్తూ..

ఇద్దరూ లేచి ఇంటిదారి పట్టారు..

ఆవిడ కావేరి నది వైపు దిగులుగా చూసింది..

" ఎన్ని ఫిర్యాదులిచ్చినా ఎవరూ పట్టించుకోరు.. ఇంత అందమైన నదిని ఇలా పొల్యూట్ చెయ్యడం ఎంత వరకు కరక్ట్?" అందావిడ కొద్దిగా బాధగా.

"ఉన్నప్పుడు మిస్ యూజ్ లేదా అబ్యూజ్ చెయ్యడం, ఆపైన లేదని బాధ పడడం మనుషులందరికీ మామూలే కదా! వనరులైనా, వ్యక్తులైనా ఒకటే పద్ధతి."అన్నాడాయన.

మాట్లాడలేదు ఆవిడ. మరో పది నిమిషాల్లో ఇల్లు చేరుకున్నారు.

మరో అరగంట తర్వాత డోర్ బెల్ మగితే తలుపు తెరిచిన ఆవిడ..

"కరుణేష్, ఎలా ఉన్నారు?" అంది ఆనందంగా, ఎదురుగా ఉన్న ఆరడుగుల వ్యక్తిని లోపలకి ఆహ్వానిస్తూ..

'నేను బావున్నాను, మీరు చాలా మారిపోయారు! అమెరికాలో సుచిత్ర గారికీ మీకు పోలికే లేదు." అన్నాడు ఆయన నవ్వుతూ..

"మారిందా? ఇందాకే నేను లేదు అన్నాను!" చక్రవర్తి నవ్వుతూ అన్నాడు.

" నా ఉద్దేశ్యం, ఆవిడ వేష ధారణ గురించి" అన్నాడాయన నవ్వుతూ.

"బీ ఏ రోమన్ ఇన్ రోమ్ అనలేదూ?" అంటూ

" పిల్లలు మృదుల ఎలా ఉన్నారు?" అంది సుచిత్ర. ట్రేలో మంచినీళ్ళ గ్లాస్ లు తీసుకొస్తూ.

"అందరూ బిజీ. అందుకే కాన్ ఫరెన్స్ కి కూడా నేనొక్కడినే వచ్చాను'" అన్నాడు కరుణేష్ సోఫాలో కూర్చుంటూ..

"ఇప్పుడు కబుర్లు మొదలుపెట్టకు సుచీ! ఆకలి, టిఫిన్ ఏమిటి? ముందు తినేసి ఆపైన హాయిగా కబుర్లు చెప్పుకుందాంఅంటూ.. ఈరోజు ఓట్ మీల్ తినడం నావల్ల కాదు" అన్నాడు నవ్వుతూ.

" ఈరోజు కరుణ కి ఇష్టమైనదే, సేమ్యా ఉప్మా ఇప్పుడే చేశాను.." అందావిడ టేబిల్ దగ్గర ప్లేట్ లు సర్దుతూ.

ముగ్గురూ టిఫిన్ తిని, వేడిగా ఫిల్టర్ కాఫీ తాగారు.

“నాకింకా మిమ్మల్ని అమెరికాలో చూసినట్టు, మీ ఇంట్లో ఉండి మీ చేతి వంట తిన్నట్టే ఉంది” అన్నాడు కరుణేష్ ఆప్యాయంగా వారివైపు చూస్తూ..

“ మాకు మాత్రం! ఆ చిన్న కరుణేషే గుర్తుంటాడు, మీరెంత పెద్ద సర్జన్ అయినా సరే!" అందావిడ నవ్వుతూ..

ముగ్గురూ నవ్వారు.

“ఎన్ని సార్లు చెప్పినా మీరు మాత్రం మీరనే అంటారు నన్ను” అన్నాడు ఫిర్యాదు చేస్తున్నట్టు.

నవ్వింది సుచిత్ర

అమెరికా కి కొత్తగా వచ్చిన రోజులు. కరుణేష్ ఇండియాలో తన ఎం.బీ.బీ.ఎస్ డిగ్రీ పూర్తి చేసుకుని పై చదువులకోసం అమెరికా వచ్చిన కొత్తలో ఇంటినీ, తన ఊరుని, ఇంటి భోజనాన్ని చాలా మిస్ అయ్యేవాడు. దానికి తోడు విపరీతమైన చలి.. డ్రైవింగ్ లైసెన్స్ వచ్చేవరకూ ఎక్కడకీ కదల్లేని పరిస్థితి. కొత్తదేశం వచ్చిన చాలా మంది విద్యార్థుల్లాగే ఇబ్బంది పడేవాడు.

ఏమీ తోచక స్నేహితులతో దగ్గరలో ఉన్న షాపింగ్ మాల్ కి వెళ్ళిన ఒకరోజు అతని పరిచయం చక్రవర్తి, సుచిత్ర లతో గమ్మత్తుగా జరిగింది.

చేతులు పట్టుకుని కోట్లు వేసుకున్న ఇద్దరు చిన్న పిల్లలు అతని వైపు వచ్చి..

“మా పేరెంట్స్ తప్పిపోయారు, మీరు చూశారా?”‘ అని అమెరికన్ యాసలో అడిగారు. అర్థం అవడానికి కొన్ని క్షణాలు పట్టిందతనికి..

ఆ తర్వాత నెమ్మదిగా అడిగాడు.

“ మీ పేరెంట్స్ తప్పిపోయారా?" అని..

“అవును. అందరం కలిసే వచ్చాము, కానీ ఇప్పుడు వాళ్ళు కనబడడం లేదు, పోలీస్ తో చెబ్దామా?” అంది ఆ పాప..

వీళ్ళు ఇలా మాట్లాడుతూ ఉండగానే

“అంభీ, ఆరభీ!” అంటూ వచ్చారు చక్రవర్తి, సుచిత్ర.

అలా మొదలైంది వారితో పరిచయం. ఆ తర్వాత తరచూ వాళ్ళింటికి వెళ్ళడం, స్నేహం విడదీయలేని బంధమైంది.

చదువు పూర్తి చేసుకుని అక్కడే ఉండడానికి నిశ్చయించుకున్నాడు కరుణేష్.

అలా చాలా ఏళ్ళు ఒకే కుటుంబంలా కొనసాగారు, మృదుల కూడా వారితో హాయిగా కలిసిపోయింది, కవల పిల్లలు రవి, శశి లను చూసి ఎంతో సంబరపడిపోయారు సుచిత్ర, చక్రవర్తి.. అంభి ఆరభి ల చిన్నతనం గుర్తొస్తోందంటూ..

ఆరభి మెడిసిన్,అంభి మేనేజ్ మెంట్ రంగాల్లోనూ స్థిరపడ్డారు.

ఆరభి పెళ్ళి తను కోరుకున్న ప్రణవ్ తో జరిపించారు.

ఆ తర్వాత సుమారు రెండేళ్ళకు..

ఒకరోజు కరుణేష్ ని టీకి పిలిచి చలికి ఇబ్బంది పడుతున్నారు చక్రవర్తి. “మేము ఇండియా వెళ్ళిపోదామని అనుకుంటున్నామ”ని సుచిత్ర మొదటిసారి చెప్పినప్పుడు వాళ్ళ పిల్లల కంటే ఎక్కువ దిగులు పడ్డాడు కరుణేష్.

" అమెరికాలో ఇన్నాళ్ళుగా ఉన్నారు, ఒక్క సారి మరో చోట, మన దేశమైన సరే, వెళ్ళి ఉండగలరా? అక్కడి వాతావరణం లో ఇమడగలరా? చలే ఇబ్బంది అనుకుంటే అమెరికాలోనే కాస్త వేడిగా ఉండే ప్రదేశానికి మారవచ్చు కదా, ఫ్లోరిడా, ఫీనిక్స్ లాంటి చోట్లకి?" అన్నాడు.

“ ఎందుకో ఉండాలనిపించడం లేదుకరుణ్! కొన్నాళ్ళైనా మన దేశంలో ఉండాలనిపిస్తోంది" అన్నాడు చక్రవర్తి.

“అంభివాళ్ళు ఏమన్నారు?” అని అడిగాడు..

“ఇంకా చెప్పలేదు, ముందు నీతోనే” అన్నాడు చక్రవర్తి..

“నేనైతే వెళ్ళద్దని అంటాను. అక్కడ ఒక్కరూ ఉండాలి, ఇక్కడ మేమంతా ఉంటాం కదా” అన్నాడు గట్టిగా.

“నాకు కొన్నాళ్ళు ప్రశాంతంగా ఉండాలని ఉంది” అంది సుచిత్ర..

“అంటే?”

“ఈ ఉరుకులు, పరుగులు లేని నడక ల జీవితం గడపాలని..” అన్నాడాయన.

“ నడకల జీవితమా? అదేమిటి?” అన్నాడు కరుణేష్..

“అంటే జీవితంలో కేవలం పరుగే కాక నడక కూడా ఉంటుందని, ఒకరితో ఒకరు కలిసి నడిచిన ఏడడుగులని స్థిరంగా, స్థిమితంగా హడావిడి లేని నడకలా జీవితాన్ని కొనసాగించడం..”

“లెక్క సరిపోయిందా డాక్టర్" అంది సుచిత్ర.

అంభి, ఆరభి కూడా చాలా చెప్పారు.

కానీ ఎందుకో వాళ్ళు వెళ్ళిపోవడానికే మొగ్గు చూపారు.

ఎప్పటినించో గుడి ఉన్న ఊర్లో ఉండాలని సుచిత్ర కోరిక..

తన తాతగారు పుట్టిన ఊరని శ్రీరంగం లో ఉందామని తన కోరిక. కావేరి నది అంటే ప్రాణం తనకి. అందుకే కొన్నాళ్ళు ప్రయత్నిద్దామని.

“ఉండలేకపోతే వచ్చేస్తాం, మీరందరూ ఇక్కడే ఉన్నారు కదా!” అంటూ తమ నిర్ణయం ప్రకారం ఇండియా వచ్చేశారు

వారితో పరిచయాన్ని, వారు తమ దేశానికి తిరిగి వచ్చేయడాన్ని గుర్తు చేసుకుంటూ

“ఎలా ఉన్నారు? ఐదేళ్ళవలేదు మీరొచ్చి? ఇక్కడ అడ్జస్ట్ అయ్యారా?” అన్నాడు కరుణేష్

“చక్కగా ఉన్నాము, హాయిగా!” అంది సుచిత్ర.

“అవును, సుచిత్ర చెప్పింది నిజం.. ప్రశాంతంగా ఉంది ఇక్కడ..” అన్నాడు చక్రవర్తి..

'గుడ్! మాకు మాత్రం మీరందరూ బాగా గుర్తొస్తారు.. మిస్ అవుతున్నా ము” అన్నాడు కరుణేష్.

“మృదుల కూడా వచ్చి ఉంటే బావుండేది..” అంది ఆవిడ.

“అలాగే అనుకున్నాం, కానీ వరసగా సర్జరీలున్నాయి ఈ వారమంతా! బిజీ అయిపోయింది,” అన్నాడు కరుణేష్.

“అలాగా? శశి, రవి పెద్దవాళ్ళయిపోయి ఉంటారు!” అందావిడ.

“అవును, హాస్టల్ కి వెళ్ళిపోతారు ఇంక.. అదే దిగులు నాకు, మృదుల కి” అన్నాడు

నెమదిగా నవ్వాడు చక్రవర్తి..

“ప్రతి ఒక్కరికీ తప్పని సమయం. ఫేజ్ ఇది !” అంది సుచిత్ర కూడా.

“అవునేమో, కానీ చిన్నపిల్లలు ఎలా ఉంటారో? అని” అన్నాడు కరుణేష్..

నిజమే అందావిడ.

“కనీసం వాళ్ళిద్దరూ కవలపిల్లలు కాకపోయినా బావుండేది. ఒకేసారి వెళ్ళేవారు కాదు కదా!” అంటుంది మృదుల అన్నాడు కరుణేష్ నవ్వుతూ.

“అంభి, ఆరభి ఎలా ఉన్నారు? ఈమధ్యలో ఏమైనా వచ్చారా? “ అన్నాడు కరుణేష్..

“అంభి వచ్చేనెల వస్తాడు, తనకి చెన్నై లో ఏదో మీటింగ్ ఉంది. ఆరభి వచ్చే సంవత్సరమే! “ అన్నాడు చక్రవర్తి.

“అవునా? మిస్ అవుతున్నారు కదా వాళ్ళని?” అన్నాడు కరుణేష్.

“మిస్ అవడం ఎందుకు? అయి మాత్రం చేసేదేముంది? ఒక స్థాయి వచ్చాకా ఎవరి జీవితం వారిదే కదా? “ నెమ్మదిగా అంది సుచిత్ర.

“మీరెప్పుడూ విలక్షణంగా మాట్లాడుతారు” అన్నాడు కరుణేష్ ఆమెవైపు చూస్తూ.

“విభిన్నంగా, విచిత్రంగా అనండి కరుణేష్ పరవాలేదు..” అందావిడ నవ్వుతూ.

"అబ్బే, నా ఉద్దేశ్యం అది కాదు.. "అని ఏదో చెప్పబోతున్న కరుణేష్ ని ఆపి..

"నేనేమీ అనుకోను.. కానీ నిజం చూస్తే అంతే కదా.."

"సృష్టిలో ఏ జీవికి లేని బంధాలు, బంధనాలు మనకి మాత్రమే ఎందుకుండాలి కరుణ్? ఏవయసులో ఆముచ్చట అనుకున్నా చదువు, పెళ్ళి, పిల్లలు ఇవన్నీ సామాన్యంగా  అందరి జీవితాల్లో జరిగేవే కదా, ఒకటో, రెండో ఏళ్ళు అటూ ఇటూగా. అంతే కదా..

ఇక పిల్లలని పెంచడం, పెద్ద చెయ్యడం, వారి రెక్కలు వారికి వచ్చి ఎగరడం నేర్చుకునేదాకా సం రక్షించడం ఇవన్నీ అన్ని జీవుల్లోనూ మామూలే. అవి పక్షులైనా, జంతువులైనా, మనుషులైనా.. మనం మాత్రమే వదలడం అనేది చేతకాక పట్టుకుని కూర్చుంటాం కదా! "

సుచిత్ర  చెప్పేది ఆశ్చర్యంగా వింటున్నాడు కరుణేష్.

"అంత ఈజీయా? వదిలేయడం! " చక్రవర్తి, కరుణేష్ ఒకేసారి అన్నారు.

"కాదు, ఖచ్చితంగా కాదు , కాని పట్టుకుని సాధించేదేముంది? మా విషయమే తీసుకోండి కరుణేష్ !

ఆరభి పెద్ద డాక్టర్, శాస్త్రీయ సంగీత కళాకారిణి. క్షణం తీరిక ఉండదు తనకి, అయినా వృత్తినీ, ప్రవృత్తినీ బాలెన్స్ చేసుకుంటూ తన కుటుంబాన్ని చూసుకోవడానికి సమయం కేటాయిస్తూ కష్టపడుతోంది. అలాంటి పిల్లని అస్తమానూ రమ్మని, మాతోనే ఉండమని ఎప్పుడూ చెప్పడం ఎంతవరకు సబబు? అనిపిస్తుంది.

అంభి సంగతి నీకు తెలీనిది కాదు. వాడి ఉద్యోగం, వాడి ఎన్.జీ.వో తరపున సేవా కార్యక్రమాలు.. వీటితో ఎప్పుడూ బిజీగా ఉంటాడు. మొన్ననే పెళ్ళి అయింది, వాళ్ళిద్దరికీ సమయం ఉండాలి కదా..

ఎవరి జీవితాలు, కుటుంబాలు వారికి వచ్చాకా, ప్రతీవారికి తగినంత స్పేస్ ఇవ్వాలి అని నా అభిప్రాయం. వాళ్ళకి రావాలని అనిపించినప్పుడు సంతోషంగా వాళ్ళే వస్తారు, ఉన్న నాలుగురోజులు సంతోషంగా మాతో ఉండి వెళతారు.

వాళ్ళున్నన్ని రోజులు మనతో ఉన్నారు కదా! అని సంతోషిస్తే మనకి సుఖంగా ఉంటుంది.. ఉన్నదాన్ని వదిలేసి ఏదో జరగలేదని బాధపడితే ప్రయోజనం ఏముంది?

మీ విషయమైనా అంతే కదా.. పిల్లలు కాలేజీలకి, పెద్ద చదువులకీ వెళ్ళాలి, వెళతారు.. దానికి మనకి బాధ, బెంగ ఉండడం సహజం.. కానీ జరిగేదాన్ని ఆపగలమా? ముఖ్యంగా జరుగుతున్నది మన కోరిక మేరకే అయినప్పుడు.."

తనకి ఎంతో తెలిసిన సుచిత్రని కొత్తగా చూస్తున్నాడు కరుణేష్

"మొదటిసారి అంభిని హాస్టల్ కి పంపవలసి వచ్చినప్పుడు అందరిలాగే మేమూ ఎంతో బాధ పడ్డాం, సరిగ్గా ఇప్పుడు మీరున్న పరిస్థితిలోనే ఉన్నామనుకోండి. నిన్నటివరకూ నావెనకే తిరిగిన బిడ్డ. అక్కడెక్కడో ఎలా ఉంటాడు? ఏం తింటాడు? అందరితోనూ ఎలా మెలుగుతాడు? ఇలా ఎన్నో ఆలోచనలు రోజూ..

ఆలోచించే కొద్దీ పెరిగే బాధ..

అలా అని చదువులకి పంపకుండా ఉండలేము కదా.. ఇలా అన్నీ నాలో నేనే..

మీకు తెలుసా కరుణేష్, ఒక సమయంలో నేను చేస్తున్న ఉద్యోగం వదిలేసి వాడి దగ్గరకి వెళ్ళిపోదాం అనుకున్నాను కూడా..

అప్పుడే మాకు తెలిసింది పిల్లలు ఆ సమయం కోసం ఎంత ఎదురుచూస్తారో? వారిదైన జీవితాన్ని, వారికిష్టం వచ్చిన రీతిలో జీవించడాన్ని ఎంత ఇష్టపడతారో తెలిసింది.. వాడు తన స్నేహితులతోటీ, ఆరభి తోనూ మాట్లాడే విధానాన్ని బట్టి అర్థం అయింది.

అది మొదటి మేల్కొలుపు అనుకోవచ్చు..

ఇల్లు వదిలి వెళ్ళాలన్న బాధ ఎక్కడో ఉండి ఉండవచ్చు వాడి మనసులో, కాని దాన్ని అధిగమిస్తున్న ఆనందం, భావి జీవితం పట్ల ఆశ, కోరిక..

ఇవన్నీ చూసిన క్షణం నా ఆలోచన మారింది.. కాదు మార్చుకున్నాను..

అప్పటినించి విషయాల్ని వాళ్ళ వైపునించి చూడడం నేర్చుకున్నాను..

ఆరభి ప్రణవ్ ని పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు అతను నా కూతురిగి తగిన వాడు కాదనిపించినా వెంటనే ఓకే అన్నాము. కానీ ఇప్పుడు నాకది కూడా లేదు, ఎవరికెవరు తగిన వారో నిర్ణయించడానికి నేనెవర్ని? అనిపిస్తుంది. నిజమే కదూ.." అందావిడ ప్రశాంతంగా నవ్వుతూ..

"దగ్గరలో ఉంటే కావలసినవన్నీ చూసుకోవచ్చు, వాళ్ళకి సాయంగా ఉండచ్చు అన్న ఆలోచనలు మార్చుకున్నాం.

మేమిద్దరం ఇద్దరు చిన్నపిల్లలతో ఎక్కడో తెలియని దేశానికి వెళ్ళి అన్నీ నేర్చుకుని హాయిగా ఉండలేదూ? అలాంటిది అక్కడే పుట్టి పెరిగిన పిల్లలు ఉండలేరా?

సాయం చేస్తున్నాం అనుకుంటూ వాళ్ళ అభిప్రాయాల్లోనూ, జీవితాల్లోనూ తలదూరుస్తూ, ప్రతీ విషయానికి అడ్డం పడుతూ ఉండడం ఎంత వరకూ కరక్ట్? అలా అని అక్కడే ఉంటే ఇవేమీ చెయ్యకుండా ఉండగలమా? లాంటి ప్రశ్నలెన్నో వేసుకున్నాము.

అలా ఆలోచిస్తూ ఉండగానే మా తాతగారు, ఆయన దగ్గర నేను పెరిగిన కొన్నేళ్ళు, మా ఈ పాత ఇల్లు గుర్తొచ్చాయి.. మనసుని హత్తుకుని మరి ఒదలనన్నాయి.. కనీసం ఇక్కడికొస్తే మన మూలాలు అదే రూట్స్ అయినా పిల్లలకి తెలుస్తాయి అన్న ఆలోచనలు దానికి బలాన్నిచ్చా యి.

పెరుగుతున్న వయసు కారణాన చక్రవర్తి చలికి ఇబ్బంది పడుతుంటే అదే సరి అయిన సమయం అనిపించి వచ్చేశాం.

అక్కడ ఏళ్ళ తరబడి వంటలు వండి, గిన్నెలు తోమి, కొలువులకి పరిగెత్తి, పిల్లలకి డ్రైవర్లమై ,స్నేహితులని,బంధువులని చూసుకుంటూ అలిసిపోయిన మాకు ఈ టెంపుల్ టవున్ గొప్ప విశ్రాంతినిచ్చింది.

మా కిష్టమైన పనులు చేసుకోవడానికి తీరికని, కోరికని ఇచ్చింది.

మా సరయు రోజంతా నాతోనే ఉండి నా చేతిలో పని అందుకుని మరీ చేసేస్తుంది. గోపాల్ రోజూ భోజం పంపిస్తాడు. కావేరి ఒడ్డున రోజూ కాలక్షేపం, పేరెంట్స్ ఇన్ ఇండియా, చిల్డ్రెన్ ఇన్ అమెరికా అనే అసోసియేషన్ లో చేరాము. అందరితోనూ సరదాగా ఉంటాము. మాకిష్టమైనప్పుడు గుడికి వెళతాము, పిల్లలదగ్గరకి వెళ్తాము, వాళ్ళకి ఇష్టమైనప్పుడు వాళ్ళు వస్తారు.

'చాలా బావుంది ఈ ఏటాచ్మెంటు లో డిటాచ్మెంట్'.. అందావిడ.

పిల్లల ఆలోచనలు చూసిన తర్వాత సుచిత్ర నాతో ఇలా చేద్దాం అన్నప్పుడు నాకు పెద్దగా రుచించలేదామె మాటలు. కానీ చూడగా చూడగా తనన్నదాంట్లో నిజముంది కదా అనిపించసాగింది.

తను చెప్పిన ఉపమానాలు నేను చెప్పను, చెప్పలేను కానీ పిల్లలైనా పక్షులైనా గూటినొదిలి వెళ్ళడం సహజం అని రెక్కలొ చ్చాకా ఎగరడం వారి సహజలక్షణం అనీ, వాళ్ళని ఎగరనీ, ఆ దారిలో మనం, మన ప్రేమతోనైనా సరే అడ్డురాకూడదని తను చెప్పిన మాటలు మెల్లమెల్లగా నాకర్థం అవడం మొదలు పెట్టాయి.

ప్రస్తుత కాల మానపరిస్థితుల దృష్ట్యా.. అది మనకి, వారికి చాలా మంచిదని అర్థం అయింది. అందుకే ప్రయత్నించి చూద్దాం అనుకున్నాం.

బావుంది ప్రయత్నించి చూడడం." అన్నాడు చక్రవర్తి కూడా.

డోర్ బెల్ మోగింది, "గోపాల్ వచ్చినట్టున్నాడు భోజనం తీసుకుని, మాటల్లో టైమే తెలియలేదు.." అంటూ లేచింది సుచిత్ర.

Click here to share your comments on this story